www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 17 మే 2023

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- నేడే పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్ : పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కొరకు ఈనెల 17న నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లు ఆదిలాబాద్ జిల్లాలో పూర్తయినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ భరద్వాజ మంగళవారం తెలిపారు. బుధవారం నిర్వహించే ఈ పరీక్ష కొరకు ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 1200 మంది విద్యార్థులు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో 240 మంది, విద్యార్థి కళాశాలలో 432 మంది, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో 240 మంది, టీటీడబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాలలో 192 మంది, టిటిడబ్ల్యూఆర్ జేసీ కళాశాలలో 96 మంది మొత్తం బాలురు 628 మంది, బాలికలు 572 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ - దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామ పంచాయతీ పరిధిలో గల శివాజీగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవి మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు గ్రామస్తులందరు ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండ కృష్ణమూర్తి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



భారత్ బచావో మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - హాజీపూర్

సోమవారం మంచిర్యాలలో జరిగిన భారత్ బచావో సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నామని మంచిర్యాల ఇన్‌చార్జి వడ్డేపల్లి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మెన్‌గా కనుకుంట్ల మల్లయ్య, ఉపాధ్యక్షులుగా అదె మంగ, రంగు రాజేశం, సుంకర భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇబ్రహీం, జిల్లా కార్యదర్శిగా రాజన్న యాదవ్, కోశాధికారిగా జాగటి పోచం, కార్యవర్గ సభ్యులుగా కొండిల్ల శ్రీనివాస్, గుమ్ముల శ్రీనివాస్, గవ్వల శ్రీకాంత్, మంతెన రాయమల్ల, గుంటుక సోమన్న, యం.డి. రావూఫ్, కల్లెపల్లి సంజీవ్, రాసపెల్లి రాజు, తిప్పారపు సారయ్య, పర్స శ్రీనివాస్, బుద్ధి చంద్రమౌళి, సంఘం లక్ష్మణ్, సిరెటి రాజన్న, జయకృష్ణ ఎన్నికయ్యారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రజాస్వామిక, లౌకిక విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. రాబోవు కాలంలో మంచిర్యాల జిల్లా ప్రాంతంలో, భారత్ బచావో కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ఈ కమిటీ తోడ్పడుతుందని వివరించారు.

ఐకేపీ వీఓఏల దీక్షకు ఏబీఎం మద్దతు

నవతెలంగాణ- ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని ఐకెపి వీవోఏలు చేస్తున్న నిరాహార దీక్షకు ఆదివాసి భారత్ మహాసభ రాష్ట్ర నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏబీఎం రాష్ట్ర నాయకుడు పెందూరి రాజేష్ మాట్లాడుతూ ఐకెపి వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వీవోఏలతో వెట్టిచాకిరి చేయించుకున్న ప్రభుత్వం వారి పనికి సరిపడా వేతనం కూడా ఇవ్వడం లేదన్నారు. వెంటనే వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 22న చేపట్టే చలో కలెక్టరేట్ తోపాటు చలో ప్రగతి భవన్ ముట్టడి కి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి గొగర్ల తిరుపతి, ఏబిఎం నాయకులు నాగేష్, శ్రీనివాస్, వివోఏల సంఘం నాయకులు జ్యోతి, సునీత, రమాదేవి, కల్పన పాల్గొన్నారు.

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ప్రస్తుతం ఎండ తీవ్రత విపరీతంగా ఉందని ఎండల పట్ల అప్రమత్తంగా ఉంటూ సిబ్బంది విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి కూలింగ్ వాటర్ బాటిల్స్, మజ్జిక ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. వడగాలుల నుండి రక్షణ పొందడానికి కూలింగ్ గ్లాసులు ధరించాలని సూచించారు. ఎండ దెబ్బ తగలకుండా పాటించవలసిన వివిధ రకాల నియమ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సిఐ రాణా ప్రతాప్, టాస్క్ ఫోర్స్ సిఐ సుధాకర్, ఎస్ఐ గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

నవతెలంగాణ- జన్నారం

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం జన్నారం మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ ప్రారంభించారు. తిమ్మాపూర్ ఊర చెరువు నుంచి, మత్తడి వాగు ఎస్టీ కాలనీ వరకు పనులను చేయనున్నట్లు ఆయన తెలిపారు. కూలీలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నీడ, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు. కూలి చేసిన ప్రతి ఉపాధి హామీ కూలీలకు వెంట వెంటనే వారి అకౌంట్లో డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డు సభ్యులు చిందం చంద్రయ్య, జాడి వెంకట్, జునుగురు లక్ష్మీ, జాడి రాజన్న, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అదనపు కలెక్టర్ పర్యటన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ దాసరి వేణు పర్యటించారు. జీవో నెం 76 కింద సింగరేణి కంపెనీ సరెండర్ చేసిన భూములలో ఇండ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు రెగ్యులరైజ్ చేసేందుకు డీడీలు త్వరగా చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఇళ్ల పట్టాల కోసం డిడి కట్టని వారి ఇంటికి వెళ్లి త్వరగా కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, ఆర్ఐలు రవికిశోర్, నవీత్, వార్డుల కౌన్సిలర్లు ప్రవంతి-సతీష్, రెవెల్లి ఓదెలు,కో ఆప్షన్ యాకుబ్ అలీ,ఆర్పీలు,విఆర్ఏ లు పాల్గొన్నారు.

మండల స్థాయిలో సీఎం కప్ ఆటల పోటీలు

భీమిని : మండలంలో మంగళవారం తెలంగాణ క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీలను సోమవారం అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి, ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా ప్రారంభించారు. తదనంతరం గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజయ్య, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, మండల విద్యాధికారి మహేశ్వరరెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ ఆటల పోటీలు

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో ప్రారంభించిన సీఎం కప్ ఆటల పోటీలు మంగళవారంతో ముగిసినట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ఎనిమిది వాలీబాల్ జట్లలో పెగడపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వాలీబాల్‌తో పాటు కబడ్డీ, అథ్లెటిక్స్, షాట్‌పూట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు 2023 సీఎం కప్ ఆటల పోటీల ప్రశంషా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు లింగస్వామి, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఎమ్మెల్యే, ఎంపీటీసీలు సహకరించడం లేదు

పెంబి : మండల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీటీసీలు సహకరించడం లేదని జడ్పీటీసీ జానూబాయి అన్నారు. మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని తెలిపారు. మండల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్దామంటే సమావేశాలు వాయిదా వేస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ కవిత గోవింద్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

లక్షెట్టిపేట్: మండలంలోని వెంకట్రావుపేట్ గ్రామానికి చెందిన కొలిపాక సతీష్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో 2000-2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సతీష్ కొంతకాలంగా షుగర్, మెదడు సంబంధిత వ్యాధులతో బాధపడుతూ మృతి చెందాడని తెలుసుకుని స్నేహితులు తమ వంతుగా డబ్బులు జమ చేసి ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంతోష్, లింగన్న, తిరుపతి, చుక్కన్న, కమలాకర్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

బోథ్ : మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన నల్ల సతీష్ కొన్ని రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇంట్లోనే ఉన్నాడు. కనుగుట్ట గ్రామానికి చెందిన మునిగల సంఘం తరఫున రూ.5000 ఆర్థిక సాయం అందించారు.

మొబైల్ మినీ ఆస్పత్రి ద్వారా విస్తృత సేవలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ- ఆసిఫాబాద్

మొబైల్ మినీ ఆసుపత్రి ద్వారా జిల్లాలో వైద్య సేవలు మరింత విస్తృతం కానున్నాయని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. జిల్లాలో మొబైల్ వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మినీ వైద్యశాలను జిల్లా పరిషత్ చైర్మన్ కోవలక్ష్మి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు ఆత్రం సక్కు, జిల్లా అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, రాజేశం, బెల్ సంస్థ జీఎం శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియాలోని మొదటిసారిగా ఆసిఫాబాద్ జిల్లాలో బెల్ సంస్థ వారి సౌజన్యంతో రూ.2 కోట్ల విలువ గల మొబైల్ మినీ ఆసుపత్రి వాహనాన్ని జిల్లా ప్రజల సంక్షేమం కోసం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మారుమూల గ్రామాలకు ఈ మొబైల్ మినీ ఆసుపత్రి వాహనం ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. మధుమేహం, రక్తపోటు, కంటి, దంత, ఊపిరితిత్తులు, ఈసీజీ, థైరాయిడ్ ఇతర సంబంధిత పరీక్షలను మినీ ఆసుపత్రిలో అందించడం జరుగుతుందని సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా ప్రజల సంక్షేమం కోసం బెల్ సంస్థ ఈ వాహనాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కొరకు 15 కంప్యూటర్లు అందజేశారని, దోమలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలలో ఓడోమాస్ క్రీముల పంపిణీ లాంటి కార్యక్రమాలతో పాటు, గత సంవత్సరం సెప్టెంబర్ నుండి ఈ సంవత్సరం మార్చి నెల వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో లెర్న్ కోడింగ్ విత్‌అవుట్ కంప్యూటర్ స్కిల్స్ అంశంపై బెల్ కంపెనీ ద్వారా శిక్షణ అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఆసుపత్రి వాహనంలో పరీక్షలు చేసే ల్యాబ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, బెల్ సంస్థ ప్రతినిధులు, వైద్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఈత కొలనులో వింత సమస్య



నవతెలంగాణ - మందమర్రి

మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్‌లో గల స్విమ్మింగ్ పూల్‌లో ఎవరికీ అర్థం కానీ వింత సమస్య ఏర్పడింది. కార్మికుల అవసరాల కొరకు బయట స్విమ్మింగ్ పూల్స్ కంటే అతి తక్కువ ధరకే సింగరేణి యాజమాన్యం చాలా సంవత్సరాల నుండి నిర్వహిస్తుండటంతో కార్మికుల కుటుంబాలతో పాటు కార్మికేతరుల కుటుంబాలు సైతం అధిక సంఖ్యలో రావడం జరుగుతుంది. కరోనా సమయంలో తాత్కాలికంగా నిలిపివేసిన అనంతరం కోవిడ్ నిబంధనలు ముగిసాక అప్పటి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ కొలనుని తిరిగి పునః ప్రారంభించడం జరిగింది. కొలను నిర్వహణ కొరకు బొగ్గు గని నీటిని వినియోగించినప్పుడు ఎలాంటి సమస్యలు లేవని కానీ గత కొన్ని నెలలుగా గోదావరి నీటిని సరఫరా చేస్తుండటంతో కొలనులో వింత సమస్య ఏర్పడిందని నిర్వాహకులు స్విమ్మర్లు వాపోతున్నారు. మొత్తం ఖాళీ చేసి నీటిని నింపినప్పుడు కొలను చాలా పరిశుభ్రంగా, పారదర్శకంగా అద్దంలాగా అడుగు భాగం కూడా స్పష్టంగా కనిపిస్తుందని కానీ పిల్లలు ఈదిన తర్వాత నీటిని నింపి క్లోరినేషన్ చేశాక రసాయన చర్య జరిగి కలుషితమైన మురుగు నీటిలాగా ముదురు ఆకుపచ్చ రంగులోకి మారిపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీంతో స్విమ్మర్లతో పాటుగా కోచ్ వెంకటేశర్లు, కాంట్రాక్టర్ ప్రసాద్ కూడా అసౌకర్యానికి, అసహనానికి గురవుతున్నారు. నేర్చుకునే వారు సైతం ఉండటంతో ఎవరెవరు ఎక్కడ ఉన్నారో తెలియక భయానికి లోనవుతున్నారు. కొలనులో ఫిల్టర్లు పూర్తిగా లేవని మోటార్లు తుప్పు పట్టి సరిగ్గా పని చేయడం లేదని వేసే ఆలం కూడా ఒకప్పటిలాగా ఉండటం లేదని, సమస్యకు పరిష్కారం కోసం గతంలో మాదిరి గని నీటిని సరఫరా చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలా కుదరని పక్షంలో బోర్ వేయిస్తే బాగుంటుందని కార్మికులు, స్విమ్మర్లు సంబంధిత అధికారులని కోరుతున్నారు.

11వ వేజ్ బోర్డు వెంటనే అగ్రిమెంట్ చేయాలి



నవతెలంగాణ- నస్పూర్

మే 19 వ తేదీన కలకత్తాలో 11వ ఏజ్ బోర్డ్ మీటింగ్ లో ఫైనల్ అగ్రిమెంట్ జరగాలని లేనిచో జాతీయ స్థాయిలో ఆందోళనకు పూనుకుంటామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. మంగళవారం ఆర్కే5బి గనిలో ఏరియా కార్యదర్శి ఎం.ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేటు మీటింగ్లో ఆయన పాల్గొని మాట్లాడారు.ఇప్పటికే మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19శాతం, కొన్ని అలవెన్సులపై ఒక ఒప్పందానికి రావడం మూలంగా వేజ్ బోర్డ్ ఆలస్యం ఎంత మాత్రం ఉండకూడదని అన్నారు. అండర్ గ్రౌండ్స్ అలవెన్స్ ఎలాంటి ఫ్రీజ్ లేకుండా తొమ్మిది శాతానికి బదులుగా 10 శాతం ఉండాలని డిమాండ్ చేశారు.4శాతం స్పెషల్ అలవెన్స్ కు బదులుగా 6శాతం ఉండాలని, కన్వేయన్స్ (పెట్రోల్) అలవెన్స్ బేసిక్ పై 1శాతం ఇవ్వాలని కోరారు.లీవులు సిక్ విత్ పే, 20క్యాజువల్ లీవులు,15 జీతం లీవులు,12 మస్టర్లకు 1లీవు (అండర్ గ్రౌండ్ ఉద్యోగులకు) , సర్ఫేస్ ఉద్యోగులకు 15 మాస్టర్లకు ఒక లీవ్ పద్ధతిలో క్యాలిక్యులేషన్ ఉండాలని డిమాండ్ చేశారు.మంత్లీ రిలేటెడ్ ఉద్యోగులకు పిహెచ్డి సీలింగ్ ఎత్తివేయాలని కోరారు.లేనట్లయితే బొగ్గు గని కార్మికులందరూ నిరసన బాట పడతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య,శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి గునిగంటి నరసింగరావు, యూనియన్ నాయకులు ఎల్లవేణి సారయ్య, విశ్వనాథరెడ్డి, కుక్కల కిష్టయ్య, పాని రాజయ్య, సుందిళ్ల నరేష్, కొత్తకొండ రాజయ్య, సిహెచ్ శ్రీనివాస్, జిపి రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వీఆర్ఏల వినతి



ఆసిఫాబాద్ : దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడప వినోద్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఇతర శాఖలను సమన్వయం చేస్తూ వీఆర్ఏలు పనిచేస్తున్నారని అన్నారు. పోటీ పరీక్షలు రాసి మెరిట్ కం, రోస్టర్ ఆధారంగా ఉద్యోగం సంపాదించినప్పటికీ తమ సేవలు రెగ్యులర్ చేయకపోవడం బాధాకరమన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేస్తున్న ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గత ఎనిమిదేళ్లలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమాతో పాటు, ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీలో తాము ఎంతగానో కృషిచేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సేవలు రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ జంజీరాల కేదారి, కో కన్వీనర్ ప్రేమ్ సాగర్, వివిధ మండలాల అధ్యక్షులు శంకర్, జాడి వసంత్, నాయకులు సుధాకర్, రవి, గురుమూర్తి, లక్ష్మణ్, అభిషేక్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా జడ్పీటీసీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- ఆసిఫాబాద్

బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జెడ్పిటిసి సీనియర్ నాయకుడని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ సుంకరి మంగాపెంటయ్య, సర్పంచులు బాపూరావు, శ్రీనివాస్, భీమేష్, నాయకులు అబ్దుల్లా, సింగిల్ విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

జెడ్పీటీసీ అరిగేల నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జమేదర్ బాబా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, ఉబెద్ బిన్ యాహియా, ఎండి అహ్మద్, ఎండి తాజ్, షాహిద్ హుస్సేన్, భీంరావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

- సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి



నవతెలంగాణ - కౌటాల

ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె సోమవారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏల సంఘం (సీఐటీయూ) జిల్లా నాయకుల వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తమ హక్కులు సాధించే వరకు సీఐటీయూ అండగా తమ వెంట ఉంటుందన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు. శిబిరంలో ఐకేపీ మండలాధ్యక్షుడు ఎర్రోళ్ల వెంకటేశ్, గౌరవధ్యక్షుడు జంగపల్లి దేవాజీ, సహాయ కార్యదర్శి కొండయ్య, ప్రధాన కార్యదర్శి అనంతుల రవి, కోశాధికారి గోగర్ల మహేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏల్ములే దత్తు, వీఓఏలు గొంగులే శంకర్, జాడి భీంరావు, టి.శ్యాంరావు, పడాల కరుణాకర్, దొంగ్రె ముక్తేశ్వర్, గోగర్ల దొండు, వడాయి కొండయ్య, పాలే పద్మ పాల్గొన్నారు.

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ



నవతెలంగాణ - బెజ్జూర్

మండలకేంద్రంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుంకన్న ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండు వరకు కొనసాగింది. డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్‌కుమార్, ఫార్మాసిస్ట్ ఆయేషా, ఏఎన్ఎంలు సునీత, మంజుల, మేఘన, సుస్మిత, ఎంఎల్‌హెచ్‌పీ భానుప్రియ, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్ : దోమలను నిర్మూలించి డెంగ్యూ వ్యాధి దరిచేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి కుమారస్వామి తెలిపారు. ఆయన మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి నిర్మూలించడం వల్ల దోమల సంతతిని అరికట్టవచ్చని తెలిపారు. కాబోయే వర్షాకాలం దృష్ట్యా ప్రజలు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం ఆరంభం నుండి పరిసరాల పరిశుభ్రత పాటించినట్లయితే డెంగ్యూ వ్యాధికి దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ ఎన్ మహాలక్ష్మి, సూపర్‌వైజర్ తార, ధనుంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమిని : వారానికి ఒకరోజు డ్రై డే పాటించి డెంగ్యూ వ్యాధిని అరికడదామని వైద్యుడు కృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలో నిల్వ చేసే నీటిని వారానికి ఒకరోజు పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే పాటించాలన్నారు. అనంతరం ఆస్పత్రి నుంచి భీమిని కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఆర్ ఎస్ పద్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏ ఎన్ ఎం లు రాధ, ప్రమీల, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలపై కార్మికులకు అవగాహన



నవతెలంగాణ - మందమర్రి

ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్ నిజామాబాద్ ఆదేశాల మేరకు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి. మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి ఏరియా స్టోర్ లో ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలు సమకూర్చుట, నిర్వహణపై అవగాహణ సదస్సు నిర్వహించారు. ఏరియా స్టోర్స్ ఎస్ఈ పైడిశ్వర్, ఏరియా పర్యావరణ అధికారి పి .ప్రభాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ డిపార్ట్మెంట్లు, మైన్స్ నుండి ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలు సేకరించి ఏరియాలో ఉన్నటువంటి స్టోర్ కు ఇక్కడ నుండి శ్రీరాంపూర్ ఏరియా స్టోర్ కు పంపించడం జరుగుతుందని, అక్కడి నుండి మెయిన్ స్టోర్స్ కొత్తగూడెంకు పంపిస్తారన్నారు.ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా క్రమ పద్ధతిలో కొత్తగూడెం నుండి ప్రభుత్వంచే గుర్తించబడిన సంస్థలకు టెండర్ ద్వారా ఈ వ్యర్థ పదార్థాలను ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శశిధర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టీబీజీకేఎస్ రిప్రజెంటేటివ్ ఏ. కనకయ్య, ఏఐటీయూసీ రిప్రజెంటేటివ్ బి. మల్లేష్ ఇతర ఉన్నతాదికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

తాటి చెట్లు నరికితే చర్యలు

నవతెలంగాణ- జన్నారం

అకారణంగా తాటి,ఈత చెట్లను నరికి వేస్తే సంబంధి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని లక్షెట్టిపేట ఎక్సైజ్ ఎస్ఐ రాబర్ట్ అన్నారు. మంగళవారం జన్నారం గ్రామంలో ఇటీవల పొలం గట్టుపై ఉందని కూల్చివేసిన తాటి చెట్లను పరిశీలించారు. ఆ కారణంగా తాటి చెట్లను నరికివేశారని జన్నారం కు చెందిన గీతా కార్మికులు చేసిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలంకు వెళ్లి పరిశీలించామని వీటిపై విచారణ జరుపుతామని తెలిపారు.ఆయన వెంట జన్నారం మండల గౌడ సంఘం ప్రెసిడెంట్ మూల బాస్కర్ గౌడ్,జన్నారం గ్రామ కమిటి గౌడ సంఘం ప్రెసిడెంట్ రాసమల్ల పాపాగౌడ్,జనరల్ సెక్రెటరి తనుగుల చిన్నాగౌడ్,గీతా కార్మికులున్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
బుధవారం 17 మే 2023

ఖానాపూర్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పూర్తిస్థాయి బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం వెల్లడించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశానుసారం అధ్యక్షులుగా మంత్రరాజమ్ సురేష్, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ ఇమముద్దీన్ (ఫారుఖ్), జనరల్ సెక్రటరీగా నెరేళ్ల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా కొళ గంగన్న, క్యాషియర్‌గా బక్కశెట్టి కిశోర్, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా మట్టేరి రాజశేఖర్, లైబ్రరీ సెక్రటరీగా కే.వినయ్, ఈసీ సభ్యులుగా అసిఫ్ ఆలీ, బాశెట్టి శివకుమార్, అయిదు వెంకటేష్, కమలాకర్, పుల్లల సురేందర్, పి.రాజలింగంలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజగంగన్న, న్యాయవాదులు కిషోర్ నాయక్, షబ్బీర్ పాష, అంజర్ అహ్మద్, కమోజీ వేణు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్, బాధనకుర్తి గ్రామాల్లో ఐకేపీ ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో వాతావరణంలో పెను మార్పులు చోటచేసుకుంటున్న సందర్భంగా రైతులకు నష్టం కలగకుండా చూడాలని అన్నారు. ధాన్యాన్ని వెంటనే తూకం వేసి తరలించాలని అన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకూడదని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, సుర్జాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల వెంకటాగౌడ్, ఉప్పల శంకర్, రాజ్ గంగన్న, బూసి నరేందర్, ప్రదీప్, అధికారులు, రైతులు ఉన్నారు.

రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్



నవతెలంగాణ-కడెం

తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని నచ్చన్ఎల్లాపూర్, సారంగాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఆజ్మీర రేఖా శ్యామ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతు ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని అన్నారు. నేడు సీఎం కేసీఆర్ రైతు కష్టాలు తెలిసిన నాయకుడు అన్నారు. రైతులను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వరి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులకు ఎలాంటి కష్టం కలగకుండా చూడాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, నచ్చన్ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, సారంగాపూర్ సర్పంచ్ రాజారెడ్డి, ఎఫ్ఏ కమలాకర్, కారోబారి మహేందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు వరం కళ్యాణలక్ష్మీ



నవతెలంగాణ-ముథోల్

కళ్యాణ్ లక్ష్మీ, షాదీముబారక్, పథకాలు పేదలకు వరం లాంటిదని ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ అన్నారు. నియోజక వర్గ కేంద్రమైన ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లికి ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి అనేక రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం ముందుకు దూసుకెళుతోందని అన్నారు. ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టాలని కోరారు. ముథోల్ అభివృద్ధికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, స్థానిక సర్పంచ్ రాజేందర్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, నాయకులు మురళి, రవికిరణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మండల సీఎం కప్ విజేతలకు బహుమతుల అందజేత



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామంలో కొనసాగుతున్న సీఎం కప్ ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. సీఎం కప్ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు జెడ్పీటీసీ బహుమతులు అందజేశారు. గెలుపొందిన వారిలో వాలీబాల్ బాలుర విభాగంలో మొదటి బహుమతి నందిగాం జట్టు, రెండో బహుమతి కొత్త నందిగాం జట్టు, ఖోఖో కుచులాపూర్, భరంపూర్, కబడ్డీలో మొదటి బహుమతి పల్సి(కె), రెండో బహుమతి కుచులాపూర్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు సాయికుమార్, రెండో బహుమతి ప్రశాంత్, మూడో బహుమతి సచిన్, బాలికల విభాగంలో మొదటి బహుమతి సోనీ, రెండో బహుమతి యోగిత, మూడో బహుమతి రాజేశ్వరి గెలుపొందారు. కాగా 400 మీటర్స్‌లో మొదటి బహుమతి అభిలాష్, రెండో బహుమతి సాయి కుమార్, మూడో బహుమతి వేణు, జంగుబాయి, హర్షిత, లక్ష్మి గెలుపొందిన వారిలో ఉన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు సీఎం సిల్వర్ కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగీర్థబాయి, తహసీల్దారు వనజ, ఎంపీడీఓ రమాకాంత్, ఎంఈఓ నారాయణ, ఎంపీఓ దిలీప్ కుమార్, ఎంపీటీసీ లక్ష్మి, పల్లి(కె) సర్పంచ్ రమేష్‌రెడ్డి, గ్రామస్తులు కేదారీశ్వర్‌రెడ్డి, ప్రతాప్, మేకల మల్లన్న, బొల్లారపు బాబన్న, రమాకాంత్, వెంకటి, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శి అనిల్ రెడ్డి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండ్లి మండపంలో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని శ్రీసరస్వతి కళ్యాణ మండపంలో మంగళవారం ప్రమాద వశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివాహ వేడుకల సందర్భంగా కల్యాణ మండపం బయట బంధువులు టపాకాయలు పేల్చిన అనంతరం నిప్పురవ్వలు ఎగిసిపడి టెంట్లపై పడ్డాయి. అసలే ఎండ కాలం కావడంతో నిప్పు అంటుకొన్న టెంట్లు కాలిపోవడంతో కుర్చీలకు అంటుకున్నాయి. టెంట్ల కింద బైకులు ఉండటంతో బైకులు స్వల్పంగా కాలిపోయాయి. స్థానికులు, బంధువులు నీటితో మంటలను ఆర్పి వేశారు. నాలుగు బైకులు, కుర్చీలు, టెంటు అగ్నికి కాలిపోయాయి. ప్రమాదాల నివారణకు మండపంలో కనీస ఏర్పాటు లేకపోవడంపై పెండ్లి తరపు బంధువులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో వివాహానికి వచ్చిన వారు ఎవరు గాయపడకపోవడంతో పెళ్లి సిబ్బంది పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేష్ తెలిపారు.



మినీస్టేడియం నిర్మాణానికి చిగురిస్తున్న ఆశలు



నవతెలంగాణ-ముథోల్

నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో మినిస్టేడియం నిర్మించాలని గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే...ముథోల్‌లో క్రీడా కార్యక్రమాల కోసం స్టేడియం లేకపోవడంతో, క్రీడాకారులు నానా అవస్థలు పడుతున్నారు. స్టేడియం లేకపోవడంతో ముథోల్‌లో క్రీడాకారులు, పాఠశాల మైదానం, జూనియర్ కళాశాల మైదానం, పాత గోదాం, ఆయా ప్లాట్‌లలో ఆటల పోటీలు ఆడుతున్నారు. దీంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విశాలమైన ఆట స్థలాలు ఉన్నప్పటికీ, అందులో స్టేడియంకు కావాల్సిన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముథోల్ జిల్లా పరిషత్ హై స్కూల్ మైదానం క్రీడాకారులు వివిధ ఆటల పోటీలను ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇదే పాఠశాల మైదానంలోనే జిల్లా, రాష్ట్ర స్థాయి, అంతరాష్ట్ర, క్రికెట్ పోటీలు ప్రయివేట్ ఆర్గనైజేషన్ వారు నిర్వహించారు. అలాగే వాలీబాల్, ఖోఖో, కబడ్డీతో పాటు వివిధ ఆటల పోటీలు ఈ మైదానంలోని జరుగుతున్నాయి. అయితే గతంలో భైంసాలో ప్రభుత్వం స్టేడియం నిర్మించింది. దీంతో ముథోల్‌లో స్టేడియం నిర్మాణం కలగానే మిగిలిపోయింది. దీంతో కనీసం ముథోల్‌లో మీనిస్టేడియం నిర్మించాలని క్రీడాకారులు, స్థానికుల నుండి డిమాండ్ వచ్చింది. ముథోల్‌లో మినిస్టేడియం నిర్మించినట్లయితే బాసర, తానూర్, లోకేశ్వరం, మండలాలకు అందుబాటులో ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇటీవల ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, ఆరిపోద్దిన్, జైభీమ్‌తో, పాటు పలువురు నాయకులు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ముథోల్‌లో మినిస్టేడియం నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. తాజాగా సోమవారం ముథోల్‌లో మండల సీఎం కప్ ఆటల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి త్వరలో మినిస్టేడియం మంజూరు అవుతుందని ప్రకటించారు. దీంతో మళ్లీ మిని స్టేడియం మంజూరుకు మార్గం సుగమం అవుతున్నట్లు క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మినిస్టేడియం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం

- జాతీయ డెంగ్యూ దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డెంగ్యూ వ్యాధి ప్రమాదకరమైనదని, ప్రజల భాగస్వామ్యంతో వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మంగళవారం స్థానిక కేఆర్కే కాలనీలోని బస్తి దవాఖానలో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల నియంత్రణకు ప్రజలందరికి అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో గత సంవత్సరం 207 డెంగ్యూ వ్యాధులు నమోదయ్యాయని తెలిపారు. వైద్య, మెప్మా మున్సిపల్ శాఖల సమన్వయంతో వ్యాధి నియంత్రణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను, పనికిరాని, వాడుకలో లేని వస్తువులను గుర్తించి, వాటిని తొలగించాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో, మురుగు కాల్వల్లో చెత్తా తొలగించాలని పూడికతీత చేపట్టి నీరు పారేటట్లు చూడాలని సూచించారు. ప్రజలకు వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు డెంగ్యూపై అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం వ్యాధి నియంత్రణకు విశేష కృషి చేసిన మెప్మా మున్సిపల్, వైద్య సిబ్బంది 20మందికి ప్రశంసా పత్రాలను అదనపు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ వ్యాధి నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజలకు అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం కాలనిలోని విధులు, ఇంటి పరిసరాలను పరిశీలించి, అధికారులకు, ప్రజలకు అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.రాథోడ్ నరేందర్, మున్సిపల్ కమీషనర్ శైలజ, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నార్నూర్ : డెంగ్యూ వ్యాధికి నివారణే ముఖ్యమని పీహెచ్‌సీ వైద్యులు డా.రాంబాబు, రాజమణి అన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుండి గాంధీచౌక్ వరకు వైద్యసిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దామని డెంగ్యూ వైరస్‌కు మందు లేదని, డెంగ్యూ వ్యాధికి వ్యాక్సిన్ లేదని నివారణే ముఖ్యమని పేర్కొన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగే ప్రదేశాన్ని నిర్మూలించాలని నీటి ట్యాంకుపై మూతలు బిగుతు ఉంచాలని చెత్త చెదారం ఎప్పటికప్పుడు పారవేయాలని తెలిపారు. నీటినీ ఎప్పటి కప్పుడు మార్చుతూ సెప్టిక్ ట్యాక్‌పై మూతలు ఉంచాలని అన్నారు. పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా దోమలు ఇంట్లో ప్రవేశం కాకుండా తలుపుకు దోమతెరలు వాడాలని అన్నారు. డెంగ్యూ వ్యాధితో బాధపడు రోగులు సాయంత్రం ఉదయం ఒక గ్లాసు బొప్పాయి పండ్ల రసం, పండ్లు ఎక్కువ తీసుకున్నట్లైతే ప్లేట్‌లేట్స్ కణాలు పెరుగుతాయని తద్వారా డెంగ్యూ జ్వరాన్ని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లు చరణ్‌దాస్, సత్తవ్వ వైద్య సిబ్బంది రవీందర్, అదిప్, ఏఎన్ఎం, ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు.



నార్నూర్‌లో..

మున్సిపల్ వైస్ చైర్మెన్‌ను పదవి నుంచి తప్పించాలి

- మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానిని ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని, మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్నూరు కాపు సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో అక్రమార్కుల ఆగడాలు శృతి మించిపోయాయని అధికార బలంతో ప్రశ్నించే గొంతుకలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో తమ సంఘానికి చెందిన గంద్రత్ మహేందర్‌పై మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని ఉద్దేశపూర్వకంగా దుర్భాషలాడారని మండిపడ్డారు. బాధ్యతగల ప్రజా ప్రతినిధి స్థానంలో ఉండి సదరు యువకుడిపై దాడికి యత్నించాడని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోకి ఇతరులు ఎవరు రావడానికి అనుమతి లేదన్న వైస్ చైర్మెన్ జహీర్ రంజానిని తన పదవి నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పట్టపగలే మున్సిపల్ కార్యాలయంలో దాడులకు పాల్పడుతున్న వైస్ చైర్మెన్‌పై చట్టపరమైన చర్యలకు ఆదేశించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తా రోకోలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు కె.జైపాల్, కే.సంతోష్, ఆర్.రాజు, జె.రవి, జి.మహేందర్, ఉష్కం రఘుపతి, ఎస్.రవి, పి.సతీష్, ఎం.సతీష్, టి.సతీష్, ఎల్.శివ, ఏ.శరత్, సంతోష్, దయాకర్ పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుని బెదిరింపులను ఖండించిన బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపాలిటీ నీ తాతా జాగిరా అని మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానిను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ప్రశ్నిస్తూ మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మెన్ అక్రమాలను అవినీతిని ప్రశ్నించినందుకు బీజేపీ నాయకులపై దాడి చేస్తానని బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ అవినీతి బాగోతాలకు అడ్డగా మారిందని అన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న ఆగడాలు కబ్జాలు గురించి మాట్లాడితే అడగడానికి మీరెవరు, మీరు ఇక్కడికి రావద్దని వైస్ చైర్మెన్ జహీర్ రంజాని బీజేపీ కార్యకర్తలపై దౌర్జన్యం చేయడం చైర్మెన్ జోగు ప్రేమేందర్ చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. గతంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వారి తొత్తులు చేసిన అక్రమాలను అక్రమ రిజిస్ట్రేషన్‌లను బీజేపీ ప్రజల ముందు ఉంచిందని అన్నారు. దీనిపై కమీషనర్‌కి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అసలు నిర్మాణం లేని ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ ఎలా కేటాయించారని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకుల ఆగడాలు శృతిమించుతున్నాయని అన్నారు. పట్టణంలో స్వాధీనం చేసుకున్న ఒక జిన్నింగ్ మిల్లు స్క్రాప్‌ను రికార్డుల్లోకి ఎక్కించకుండా డైరెక్ట్‌గా టెండర్లు కూడా వేయకుండా అమ్ముకోవడంపై ప్రశ్నిస్తే కమిషనర్ తనకేమీ తెలియనట్టు వ్యవహరించారని అన్నారు. మున్సిపాలిటీలోని వ్యాపార సముదాయాన్ని కొందరు బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసుకుని వాటికి కిరాయి కూడా చెల్లించకుండా తమ అడ్డాలుగా మార్చుకున్నారని అన్నారు. వీధి వ్యాపారుల కోసం వేసిన షెడ్లను టెండర్ పిలవకుండా తమకు డబ్బు ఇచ్చిన వారికి అమ్ముకోవడం వ్యవహారాన్ని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు. ఈ వ్యాపార సముదాయాలను కొందరు బడా వ్యాపారులకు ఇచ్చి పేద మధ్యతరగతి వీధి వ్యాపారులకు మొండి చేయి చూపుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అర్హులకు ఆ షెడ్లను పంపిణీ చేయాలని లేదంటే దీనిపై బీజేపీ పోరాడుతుందని అన్నారు. అభివృద్ధి పేరుతో జోగు రామన్న పట్టణానికి అనుకొని ఉన్న గ్రామాలను మున్సిపల్ మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకున్నారు. ఆ గ్రామాల్లో ఉన్న స్థలాలను కబ్జా చేసుకోవడం మాత్రం నిరవధికంగా కొనసాగిస్తున్నారని అన్నారు. సమావేశంలో పట్టణ నాయకులు లాలా మున్నా, జోగు రవి, ఆకుల ప్రవీణ్, రఘుపతి, కృష్ణా యాదవ్, సోమ రవి, మహేందర్, శ్రీనివాస్, రత్నాకర్ రెడ్డి, విజయ్, ముకుందరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి

నవతెలంగాణ-ముథోల్



విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సీఎం కప్ ఆటల పోటీల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలిపొందిన క్రీడ జట్లు, జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మోడల్స్, కప్‌లు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీడీఓ సురేష్ బాబు, ఎస్సై సాయికిరణ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, సర్పంచ్ రాజేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకున్న జిల్లా విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు సహాయ ఆచార్యుడు ఆర్.సంతోష్ కుమార్ మార్గదర్శకత్వంలో రూపొందించిన, 'బూర్నూరు గ్రామ సమగ్ర చరిత్ర' అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. రెండు దశల్లో నిర్వహించిన జిజ్ఞాస పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు ఈ బహుమతిని సాధించారు. ఈనెల 1వ తేదీన ప్రభుత్వ సిటీ కాలేజ్ హైదరాబాద్‌లో జరిగిన ప్రదర్శనలో న్యాయ నిర్ణేతల మన్ననలు పొంది, వీరి ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రూ. 21 వేల చెక్కు, ప్రశంసా పత్రాలు ఉన్నతవిద్యామండలి చైర్మెన్ ఆచార్య లింబాద్రి చేతుల మీదుగా ప్రిన్సిపాల్, అధ్యాపకుడు విద్యార్థులు, అందుకున్నారు. ఈ సందర్భంగా బహుమతి సాధించిన అధ్యాపకుడు, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రామ్ అంతర్వేది, జిజ్ఞాస జిల్లా సమన్వయకర్త కే.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుండి రాష్ట్రస్థాయి బహుమతి సాధించిన ఏకైక ప్రాజెక్టు కావడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు డా. యాదగిరి డా. రాజేంద్రసింగ్ బహుమతి సాధించిన వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం

- జిల్లా అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి డీజీపీ అంజనీ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావులతో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులతో వానాకాలం సీజన్ ముందస్తు ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించి రైతులతో పాటు కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. గత 9 ఏండ్లలో వ్యవసాయ రంగానికి దాదాపు రూ.4.5 లక్షల కోట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న రైతు అనుకూల విధానాల కారణంగా నేడు రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సమయానికి అందించడంతో పాటు పంట దిగుబడి అధికంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల నిల్వలను ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా పూర్తిగా అరికట్టాలని, క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించి పక్క రాష్ట్రాల నుండి వచ్చే నకిలీ విత్తనాలు, ఎరువులను నియంత్రించాలని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి నిఘా పెంచాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్ శాఖల సమన్వయంతో టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. గడువు తేది ముగిసిన విత్తనాలు అమ్మడం, లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపట్టడం, హెచ్‌టీ పత్తి విత్తనాల అమ్మకం, లైసెన్స్ ఇతరులకు అందించి విక్రయాలు చేపట్టడం, నకిలీ విత్తనాలు ఉండటం వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏటీఎంలో నుంచి బయటకు వచ్చిన నగదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ పక్కనున్న మజీద్ సమీపంలోని ఎస్బీఐ ఏటీఎం నుంచి 9 వేల నగదు బయటికి వచ్చిన విషయాన్ని ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఒకరు గమనించారు. ఖాతాదారుడు ఎవరు డబ్బు డ్రా చేసే ప్రయత్నం చేస్తుండగా నగదు బయటకు రావడంలో ఆలస్యం కావడంతో అతను వెళ్లిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఈ నగదును కానిస్టేబుల్ స్వాధీనం చేసుకుని రెండో పోలీస్‌స్టేషన్ జమ చేశారు. బాధితులు ఎవరైనా ఉంటే పూర్తి ఆధారాలతో వస్తే నగదు అప్పగిస్తామని టూ టౌన్ సీఐ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పోటే శోభ అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుష్పలత ఒక ప్రకటనలో తెలియజేశారు. సంభందిత వివిధ శాఖల అధికారులు ఉదయం 11.గంటలకు పూర్తి సమాచారంతో హాజరు కావల్సిందిగా ఎంపీడీఓ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన రావులబండి సాయన్న(54) అప్పులబాధ భరించలేక పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాగా స్థానికులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 17 మే 2023

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-తాండూర్



పదోతరగతి ఫలితాలలో 10/10 జీపీఏ సాధించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని ముల్కల సాయివర్షితను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయి వర్షిత భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లితండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసురావాలని తెలిపారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహిస్తున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బోధన సిబ్బందిని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చేర్ పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు డైరెక్టర్లు ఏలూరి వెంకటేశం, ఈ.రవిప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఎం.రాజారమేష్ పాల్గొన్నారు.

మహార్‌లు ఐక్యంగా ఉద్యమించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో మహర్‌లు మాల కాకున్నా మాలలుగా సర్టిఫికెట్‌లు ఇస్తూ మహార్‌ల ఐక్యతను దెబ్బతీస్తున్నారని మహర్ సర్టిఫికెట్లతోపాటూ ఇతర సమస్యల పరిష్కారానికి ఐక్యతగా ఉద్యమించాలని తెలంగాణ మహార్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు జాడి దీపక్ అన్నారు. హత్తిని గ్రామంలో అంబెద్కర్ విగ్రహ ఆవిష్కరణకు రూ.5000 విరాళంగా ఇచ్చారు. అనంతరం విగ్రహావిష్కరణలో మాట్లాడుతూ మహారాష్ట్రలో మహార్‌లుగా ఆదిలాబాద్‌లో మహార్ లుగా, మంచిర్యాల బెల్లంపల్లిలో నేతకానిలుగా అసిఫాబాద్, సిర్పూర్‌లో మాత్రం మాలలుగా సర్టిఫికేట్ లు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో 8 నుండి 10 లక్షల మహార్‌లు ఉన్నప్పటికీ ప్రభుత్వం మహార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదన్నారు. తెలంగాణలో మరుగున పడిన కులం మహార్ మాత్రమె అన్నారు. అంబెద్కర్ మహార్ కులంలో పుట్టారని మహార్ లకు మాత్రం మహార్ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదన్నారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలన్నారు.

కార్మికుల హక్కులకు భంగం కలిగించడం సరికాదు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే ఓసీపీ యాక్టింగ్ మేనేజర్ రామారాజు కార్మికుల హక్కులకు భంగం కలిగించడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ అన్నారు. మంగళవారం ఆర్కే ఓసీనపీ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్బర్ అలీ మాట్లాడుతూ ఆర్కే ఓసీపీలో యాక్టింగ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రామరాజు కార్మిక వ్యతిరేక విధానాల వలన కార్మిక సోదరులు మానసిక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. కార్మికులను భోజన విరామ సమయంలో కూడా భోజనం తినకుండా పని చేపిస్తున్నాడని, కార్మిక చట్టాలను ఉల్లంగించి కార్మిక హక్కులకు భంగం కలిగించడం సరి కాదని ఆయన మండిపడ్డారు. వేసవి ఎండల నేపథ్యంలో కొందరు కార్మికులు ఒకటి లేక రెండు రోజులు విధులకు రాకపోతే వారికి సస్పెండ్ లెటర్‌లు ఇచ్చి వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ, ఒంటెద్దు పోకడలు పోతున్నాడని అన్నారు. అలాగే ఏసీలు లేని భారీ వాహనాలను నడపమని ఈపీ ఆపరేటర్లని బెదిరిస్తున్నాడని ఇలా చేయడం ఎంతవరకు సమంజసమని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఇప్పటికయినా యాజమాన్యం ఈ విషయంలో రామరాజుపై చర్యలు తీసుకుని వేరే చోటికి బదిలీ చేసి, కార్మికుల హక్కులను కాపాడాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అలాగే (నేడు)బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్కే ఓసీపీ గని వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ ధర్నా కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య, ఫిట్ సెక్రటరీ ఎ.ఆంజనేయులు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సంపత్ కుమార్, రామకృష్ణ, పూరెళ్ల శ్రీనివాస్, పోగుల రమేష్ పాల్గొన్నారు.

ఎక్కడ లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు

నవతెలంగాణ-కాసిపేట

దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణా రాష్ట్రంలో అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను 81 మంది లబ్దిదారులకు ఆయన అందజేశారు. అంతకు ముందు మల్కేపల్లిలోని వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణాలో ఉన్న రూ.2000 ఆసరా పింఛన్ ఎవరూ ఇవ్వడం లేదన్నారు. కల్యాణలక్ష్మీ పథకం దేశంలో ఎక్కడా లేదని, 2014లో ప్రధాన మంత్రి మోదీ అధికారం చేపట్టాక ఉన్న రూ.400 గ్యాస్ సిలిండర్ ఇప్పుడు రూ.1250కి పెంచాడని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, మోదీ వైఫల్యం వల్ల అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కాపడుతున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. రైతు బాగుంటే ప్రజలంతా బాగుంటారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఆరోగ్య సమస్యలపై కూడా దృష్టి సారించి గ్రామాల్లోనే వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ విక్రంరావు, తహసీల్దార్ దిలీప్ కుమార్, సహకార చైర్మన్ నీలా, రైతు బంధు అధ్యక్షుడు దుర్గం పోశం, ఎంపీటీసీలు కొండబతుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ సర్పంచ్‌లు ఆడె బాదు, దేవి, నాయకులు అగ్గి సత్తయ్య, మోటూరి వేణు పాల్గొన్నారు.

జంగుబాయి క్షేత్రం సందర్శన

నవతెలంగాణ-కెరమెరి

మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన ముకద్దంగూడ గ్రామ పంచాయతీలోని జంగుబాయి పుణ్యక్షేత్రాన్ని ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ మంగళవారం సందర్శించి నీటి ఎద్దడిని పరిశీలించారు. గిరి ప్రజల విత్తనోత్సవం జరుగుతున్న సందర్భంగా జంగుబాయి ఆలయానికి ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి తరలి వస్తున్న ప్రజలను తాగు నీటి సమస్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడులూ గత జనవరిలో రెండు చేతి బోర్లు వేసినప్పటికి ప్రస్తుతం తాగు నీరు అడుగంటిపోయినట్లు తెలిపారు. గత రెండేళ్ల క్రితం సైతం రెండు చేతి పంపులు అడుగంటి పోవడంతో తాగు నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. దీంతో ఈ వేసవిలో తాగు నీటి సమస్య తీర్చుటకు గ్రామ సర్పంచ్ లింబరావు ట్యాంకర్ ద్వారా తాగు నీరు అందించేందుకు కృషి చేశారని అన్నారు. మార్గ మధ్యలో మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్వర్టు, సిసి రోడ్డు పనులు జర్గుతుండటంతో ఆలయం వరకు ట్యాంకర్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆలయానికి 500 మీటర్ల దూరం వరకు ట్యాంకర్ ద్వార తాగు నీరు గిరి ప్రజలకు అందిస్తున్నామన్నారు. విత్తనోత్సవానికి తరలి వచ్చే ఆదివాసీ ప్రజలు సమస్యను గుర్తించి సహకరించాలన్నారు. అదేవిధంగా తాగు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని కలిసిన ఎన్‌హెచ్-63 బాధితులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట్



మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల ఏన్‌హెచ్-63 బాధితులు ఢిల్లీలోని కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన రోడ్డు నిర్మాణం ద్వారా పొలాలు, ఇండ్లు, నష్టపోతున్న వాటిని పునః పరిశీలించాలని, బాధితులకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎంపీ వివేక్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఏన్‌హెచ్-63 రూట్‌ను రీ సర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బాధితులకు నష్టం జరుగకుండా అండగా ఉంటామని వివరించారు. అంతకుముందు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ ఈ రూట్ మ్యాప్‌లో మార్పులు చేసి పేదలకు, రైతులకు నష్టం జరుగకుండా చూస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్, నాయకులు మడిపల్లి స్వామి, రంజిత్ సింగ్, నలిమేల సత్తయ్య, వీర స్వామిల పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైకోర్టు ఏప్రిల్ 24వ తేదీన ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం డిపోలో నిర్వహించిన గేట్ ధర్నా సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన కోసం 55 రోజులు సమ్మె చేశారని అప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీలో యూనియన్లను రద్దుచేసి వెల్ఫేర్ బోర్డులు నియమించారని, ముఖ్యమంత్రి నియమించిన వెల్ఫేర్ బోర్డులు కేవలం పైరవీలకే పరిమితం అయ్యాయని అన్నారు. యూనియన్‌లు రద్దు చేయడం వలన ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకీ పనిభారం, వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. కొందరు కార్మికులు ఆర్టీసీ అధికారుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఆర్టీసీలో యూనియన్ లేకపోవడం వల్ల అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రోజుకి అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని దీనికి నిదర్శనమే గతంలో జరిగిన డీజిల్, బస్సు పాసుల కుంభకోణం అన్నారు. మునుగోడు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం పెండింగులో ఉన్న పీఆర్సీని అమలు చేయాలని అన్నారు. హైకోర్టు ఉత్తర్వుప్రకారం సీసీఎస్‌కు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. 2013కి సంబంధించిన బాండ్ల డబ్బులు వెంటనే చెల్లించాలని అన్నారు. ప్రైవేట్ డ్రైవర్లకు 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హైకోర్టు ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని లేనిపక్షంలో ఈనెల 30వ తేదీన ఇందిరాపార్కు దగ్గర సామూహిక నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో అధ్యక్షులు అశోక్ కార్యదర్శి దివాకర్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్టీసీ కార్మికులు ప్రవీణ్, పోచం, మారు, రగులయ్య, ప్రైవేట్ డ్రైవర్లు తేజ, మల్లేష్, భీంరావు, శంకర్, బాలు, కిరణ్, లక్ష్మీ పాల్గొన్నారు.

పేదల పోరాటం ప్రభుత్వానికి పట్టదా..?

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య
- 17వ రోజుకు చేరిన ఇండ్ల స్థలాల పోరాటం



నవతెలంగాణ-జైపూర్

ఒకరిద్దరు కాదు వందలాది మంది మహిళలు రోడ్డుకెక్కారు..ప్రభుత్వ భూమిని ఇండ్ల స్థలాలకు కెటాయించాలని పోరాడుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం చేస్తున్న పేదల పోరాటం పట్ల ప్రభుత్వానికి పట్టింపు లేకుండాపోయిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. గత 17 రోజుల నుంచి ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న పేద కుటుంబాలను మంగళవారం కలిశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలం చూపించండంటూ పోరాడుతున్న పేదల పట్ల జాలి చూపించాల్సిన పోలీస్ అధికారులు మహిళల పట్ల బెదిరింపులకు పాల్పడుతుండటం విచారకరమని అన్నారు. పేద కుటుంబాల వారు చేస్తున్న పోరాటం న్యాయ సమ్మతమైందిగా గుర్తించాలని కోరారు. మణులు మాణిక్యాలు ఇమ్మనడం లేదు కేవలం ఇండ్లు కట్టుకోవడానికి స్థలం ఇవ్వాలంటున్న వారి అభ్యర్థన పట్ల ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. పేదలు కోరినట్లుగా బావురావుపేట్ శివారు సర్వే నెంబర్ 8లో గల ప్రభుత్వ భూమిని ఖబ్జాదారుల చెర నుండి విడిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ చూపించాల్సిన అవసరమని పేర్కొన్నారు. ఖబ్జాదారుల నుంచి తిరిగి తీసుకుని పేదలకు ఇండ్ల స్థలాల కోసం కెటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బోడంకి చందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి, కావిరి రవి, ఆవేజ్, మారయ్య, ఇండ్ల స్థలాల పోరాట కమిటి నాయకులు మణి, శ్రీనివాస్, ప్రసన్న రేణుక, సాజిత్, సంధ్య, లలిత, సమ్మక్క, లత, వైశాలి, భానుమతి, రాధిక, లక్ష్మి, నవీన్, ఉమారాణి, మౌనిక పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

నవతెలంగాణ-తాండూర్

యువకులు ఆటలతో మానసిక శారీరక ధృఢత్వాన్ని పెంపొందించుకోవాలని తాండూర్ ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ తెలిపారు. మంగళవారం తాండూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. ఓటమి చెందిన వారు దిగులు చెందకుండా పట్టుదలతో గెలుపు కోసం కృషి చేయాలని తెలిపారు. తాండూర్ ఎస్సై రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో రాణించినట్లయితే పోలీస్, నేవీ, రక్షణ శాఖల్లో ఉద్యోగాలు పొందవచ్చునని తెలిపారు. ప్రభుత్వం క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తుందని తెలిపారు. క్రీడాకారులకు వాలీబాల్ కబడ్డీ కోకో లాంగ్ జంప్ క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ కవిత, ఎంఈఓ వాసాల ప్రభాకర్, తాండూర్ ఎస్సై రాజశేఖర్, సర్పంచ్ పూదరి నవీన్ కుమార్, రైతు సమన్వయ జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి, ఎంపీటీసీ మొగిలి శంకర్, రేచీని సర్పంచ్ దుర్గాబాయి, పీఈటీలు శ్రీనివాస్ పరిమళ పంచాయతీ సెక్రెటరీలు చంద్రమౌళి, వసంత సాదుల్లా, తాపస్ కుమార్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



తాండూర్‌లో..

కోటపల్లి : గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీఓ భాస్కర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అజ్గర్ పాల్గొన్నారు. యువత ఉల్లాసంగా క్రీడలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నల్లాల ఓదెలు, డీఆర్‌డీఓ శేషాద్రి, ఏఎంసీ వైస్ చెర్మెన్ బైస ప్రభాకర్, తహసీల్దార్ సునీల్ దేశ్ పాండే పాల్గొన్నారు.



జన్నారంలో..

జన్నారం : మండల కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్లో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వాలిబాల్, కబడ్డీ, కోకో, రన్నింగ్, ఇతర పోటీలు నిర్వహించగా వాలీబాల్ ఆటలో మండలంలోని ధర్మారం జట్టు మొదటి స్థానంలో నిలవగా, చింతగూడ రెండో స్థానంలో నిలిచింది. ధర్మారం తండా జట్టు కెప్టెన్ బి.కిరణ్‌కు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు భరత్, ఎంపీడీఓ అరుణ రాణి స్థానిక ఎస్సై తానాజీ నాయక్, ఎంఈఓ విజయ్ కుమార్స, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, బీవీఎస్ నాయక్ ఉన్నారు.

డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



ఆసిఫాబాద్ : డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది శాయశక్తులా కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఆసుపత్రి నుంచి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు సిబ్బంది పూర్తి స్థాయిలో కషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏడీస్ అనే దోమ వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని ఈ వైరస్ చాలా ప్రమాదకరమైదని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు డెంగ్యూ కేసులు పెద్దగా నమోదు కాకపోవడం సంతోషకరమైన విషయం అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల ఎక్కువగా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాధి గ్రస్తులకు తీవ్రమైన జ్వరంతో పాటు శరీరం విపరీతమైన నొప్పులతో ఉంటుందన్నారు. వీటితో పాటు వాంతులు, విరోచనాలు, రక్తంతో కూడిన మలవిసర్జన లాంటి లక్షణాలు ఉంటాయని ఇటువంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, ఆస్పత్రి సూపరింటెంట్ స్వామి, వైద్యుడు సత్యనారాయణ, వినోద్, అమన్, హర్షవర్ధన్, జిల్లా ఆరోగ్య బోధకుడు రషీద్ పాల్గొన్నారు.

జన్నారం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను నివారించవచ్చని మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ ఉమా, డాక్టర్ గంగాదేవి అన్నారు. మంగళవారం నేషనల్ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగ్యూ నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశు భ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు చేరకుండా చూసుకోవాలన్నారు. మురుగునీరు చేరడం వల్ల ఈగలు దోమలు వాలి డెంగ్యూ మలేరియా లాంటి ప్రాణాంతకరమైన వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పరిసరాల పరిశు భ్రతపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్, సీహెచ్ఓ రమేష్, పీహెచ్ఎన్ దీవెన, సూపర్‌వైజర్ చంద్ర లీల, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, రషీద్‌ఖాన్, రాంబాబు, పోచయ్య, అపరంజి పాల్గొన్నారు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వారివారి పనులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎంపీటీసీ మోతిరాం ఎంపీపీతో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారని, కనిఖీ, కన్నెపెల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఎంపీపీ మండలానికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను అసలే పనులు జరగని గ్రామ పంచాయతీల్లో ఈ పనులు నిర్వహించడం జరిగిందని, మరో విడతలో మిగిలిన గ్రామ పంచాయతీల్లో సైతం పనులు పూర్తిచేస్తామని తెలిపారు. ఏ గ్రామ పంచాయతీలోనైతే గ్రామీణ క్రీడా ప్రాంగణాల కోసం భూ సమస్యలున్నాయో సమస్యలు లేకుండా ప్రభుత్వ స్థలాలను చూసి ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు. బోదంపెల్లి, కన్నెపెల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాల కోసం స్థలం తీసుకొని ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి వారివారి శాఖలో పనులను నిర్వహించాలని అధికారులకు సూచించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వారివారి గ్రామాల్లోని సమస్యలను సభా దృష్టికి తీసుకెళ్లగా వాటన్నింటినీ ఒక్కొక్కటిగా పూర్తిచేస్తామని వారికి తెలిపారు. ఆయా శాఖల అధికారులు వారివారి నివేదికలను చదివి వినిపించారు. విద్యుత్ శాఖ అధికారి ఏఈ రవీందర్ సమాధానమిచ్చారు. మండలంలో బోరుబావుల విద్యుత్ కనెక్షన్ల కోసం 510 మంది డీడీలు కట్టారని, ఎస్సీ, ఎస్టీ వారు తన కుల ధృవీకరణ పత్రాలు విద్యుత్ కార్యాలయంలో అందజేసినట్టయితే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, తహసీల్దార్ సాయన్న, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఎస్సై ప్రవీన్‌కుమార్, ఎంపీఓ మౌనిక, ఎంపీటీసీలు బొమ్మకంటి మనీష్, వసంత్‌రావు, బసార్కర్ శిరీష పాల్గొన్నారు.

ఘనంగా అరిగెల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

యాదవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ సెక్రెటరీ ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకలను మంగళవారం పట్టణ మల్లికార్జున యాదవ సంఘం అధ్యక్షులు గంగులు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. అనంతరం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నలువాల సమ్మయ్య యాదవ్, పట్టణ అధ్యక్షులు గంగులు యాదవ్ లు మాట్లాడుతూ గత నలభై సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోనీ యాదవుల ఐక్యత కోసం, యాదవ కుల సంరక్షణ కోసం నిస్వార్థంగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎలవేన గంగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగంటి సంపత్ యాదవ్, ఉపాధ్యక్షులు సంగ రవి యాదవ్, కనబోయిన రవి యాదవ్, సెక్రెటరీ పిల్లి సతీశ్ యాదవ్, తిరుపతి యాదవ్, పురుషోత్తం కుమార్ యాదవ్, యాదవ సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కూకట్ల తిరుపతి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో నకిలీ విత్తనాల నివారణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల నివారణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా పత్తి పంట సాగు చేయడం జరుగుతుందని, వచ్చే ఖరీఫ్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పోలీసు శాఖను అనుసంధానం చేసుకొని నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కృషి చేస్తామని, జిల్లా, మండల స్థాయిలలో టాస్కోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, మహారాష్ట్ర సరిహద్దులలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల రవాణాను అరికడతామని తెలిపారు. ప్రభుత్వ అనుమతి, గుర్తింపు ఉన్న విత్తన సంస్థలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి వినియోగించుకునే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలను జిల్లాలో విక్రయించకుండా పర్యవేక్షిస్తామని, వ్యవసాయ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతామని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌ల వారీగా టాస్క్ ఫోర్స్ కమిటీ నియమించి నకిలీ విత్తనాల విక్రయాన్ని నియంత్రించే విధంగా పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందనరావుతో పాటు, జిల్లా ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రం సందర్శన

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలోని మహిళా ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు మంగళవారం సందర్శించారు. మహిళలకు చికిత్స అందిస్తున్న తీరును పరిశీలించారు. చేస్తున్న సేవలను సమీక్షించారు. ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్ల ద్వారా గ్రామాల్లో మహిళా ఆరోగ్య కేంద్రాలపై ఆ గ్రామాల్లోని మహిళలకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎక్కువమంది మహిళలు ఈ ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్సలు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వైద్యులకు సూచించారు. మహిళా ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ఉచితంగానే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు గోలీలను ఉచితంగానే ఇవ్వడం జరుగుతుందన్నారు. స్త్రీలకు సంబంధించిన వ్యాధులపై ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో ఆరోగ్య మహిళా కేంద్రం నిర్వాణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డెంగ్యూ మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డా.ఉమాశ్రీ, డాక్టర్ గంగాదేవి, పీ.హెచ్ఎన్ దీవెన సూపర్‌వైజర్ చంద్ర లీల కొల్లూరి కమలాకర్ హెల్త్ అసిస్టెంట్ ల్యాబ్ టెక్నీషియన్ సత్యం పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ అష్రఫ్ నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి ఆర్టీఐ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ అష్రఫ్ నియామకమయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర గౌరవ అధ్యకులు ప్రేంసాగర్, అధ్యక్షులు బాలు యాదవ్ అష్రఫ్‌కు నియామక పత్రం అందజేశారు. అష్రఫ్ ప్రస్తుతం ఆర్టీఐ రక్షక్ విభాగానికి రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తనపై నమ్మకంతో ఆర్టీఐ విభాగానికి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-బాసర



మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్ సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఏడుగురు లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 17 మే 2023

టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల మహాధర్నా

- రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 'జర్నలిస్టుల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెడపట్ల సురేష్, షేక్ మొయిజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియా, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాలు ఆశించిన మేర ప్రేమాభిమానాలను కనబర్చడం లేదని అన్నారు. గతంలో ఎన్నో సార్లు హామీ నిచ్చారు కానీ, ఆ హామీని ఇప్పటి వరకు నిలబెట్టుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల సమస్యలను ఇండ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రేపటి ఈ మహా ధర్నాలో జర్నలిస్టులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు



నవతెలంగాణ-సిరికొండ

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం నుండి ఇచ్చోడ వెళ్లే మార్గంలో సుంకిడి గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. సిరికొండ నుండి ఇచ్చోడకు ఒకే బైక్‌పై వెళ్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ భూక్యా నరేష్, అటెండర్ నర్సయ్య, ఇచ్చోడ నుండి సిరికొండకు వస్తున్న గొర్ల శంకర్‌కు చెందిన రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బ్యాంక్ అటెండర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ అన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే వాలీబాల్ క్రీడా పోటీల్లో పాల్గొననున్న గిరిజన విద్యార్థులు అర్జున్ జస్వంత్‌ను నాయకులను మంగళవారం కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సి భవనంలో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా డిడి దిలీప్ కుమార్ మాట్లాడుతూ గిరిజన క్రీడ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు గత సంవత్సరం 200కు పైగా రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించారన్నారు. రానున్న రోజుల్లో గిరిజన విద్యార్థులు మరిన్ని పతకాలు సాధించేలా మరింత కృషి చేయాలన్నారు. దానికి అనుగుణంగా తగు కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొని గిరిజన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మిగతా గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రతిభ చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

ది కేరళ స్టోరీ సినిమా ప్రదర్శన వివాదం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో ది కేరళ స్టోరీ సినిమాను మంగళవారం ఉదయం నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు థియేటర్‌లో ఆందోళనకు దిగారు. సినిమాను ప్రదర్శించాలంటూ థియేటర్ ఎదుట నినాదాలతో హోరెత్తించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడితో బెదిరింపులతో షో నిలిపి వేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. అటు సోషల్ మీడియాలోను ప్రచారం చేశారు. అనంతరం స్థానిక నటరాజ్ థియేటర్ యాజమాన్యంతో మాట్లాడారు. షో ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. ఉదయం సాంకేతిక సమస్యల వల్ల షో వేయలేకపోయామని మధ్యాహ్నం నుండి షో యధావిధిగా ప్రదర్శిస్తామని తెలిపారు. మధ్యాహ్నం షో వేసే వరకు నాయకులు అక్కడే ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు షో ప్రారంభం కాగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు మహిళల, యువకులతో కలిసి సినిమను వీక్షించారు. ప్రతి ఒక్క హిందూ మహిళ చూడాల్సిన సినిమా అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులు ఉన్నారు.

సీఎం కప్ పోటీలను పరిశీలించిన ఎంఈఓ

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను మంగళవారం మండల ఇన్‌చార్జి ఎంఈఓ మైసాజీ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలు ఎంతో గాను దోహదపడతాయని అన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ వాలీబాల్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్టీయూ మండల అధ్యక్షుడు గంగాధర్, పీఈటీ పుష్పలత, క్రీడాకారులు పాల్గొన్నారు.

30న ద్విచక్రవాహనాల వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పలు కేసులలో పట్టుబడిన 18 ద్విచక్రవాహనాలకు 30న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వై. హిమశ్రీ అధ్వర్యంలో 30న ఉదయం 10 గంటలకు వేలంపాట ఉంటుందని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ప్రభుత్వం నిర్దేశించిన ధరావతు సొమ్మును చెల్లించి పాల్గొనాలని సూచించారు.

కేంద్ర వైఫల్యాలను క్షేత్రస్థాయిలో వివరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని అదే సమయంలో రాష్ట్రంపై బీజేపీ కనబరిచిన సవతి తల్లి ప్రేమను, ఆ పార్టీ వైఫల్యాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. పట్టణంలోని 13 వార్డులకు చెందిన ప్రజాప్రతినిధులు కార్యకర్తలు సమావేశంలో పాల్గొనగా ఎమ్మెల్యే తన కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేండ్ల కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దూరం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం అనేక బృహత్ పథకాలను అమలు చేసిందని తెలిపారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, తీవ్ర ఇక్కట్లకు గురి చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుతో సహా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలియజేశారు. అరవై ఎనిమిది సంవత్సరాల పాటు పాలించిన గత ప్రభుత్వాలు ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించలేకపోయాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని సాధించిన తొమ్మిదేండ్ల కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తీరును ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని అన్నారు. స్థానిక బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చేస్తున్న అసత్య దుష్ప్రచారాలను తిప్పికొడుతూ క్రియాశీలకంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తమ ప్రభుత్వం చేసిన కృషి గత ప్రభుత్వాలు వారి చేతగానితనంతో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించలేకపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు అశ్రాఫ్, సాజిదోద్దీన్, సలీం, స్వరూపరాణి, బొడగం మమత, బుట్టి శివకుమార్ పాల్గొన్నారు.

ఆదివాసీ బాలికలకు దుర్గం ట్రస్ట్ చేయూత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చదువుకు దూరమైన ఇద్దరు ఆదివాసీ బాలికలకు దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ చేయూతనిచ్చాడు. వారి ఆర్థిక స్థితి తెలుసుకొని చదువు బాధ్యత తీసుకున్నాడు. మంగళవారం బాలికలను తన కార్యాలయానికి పిలిపించుకొని కేజీబీవీలో చేర్పించారు. ఇటీవల ఉట్నూర్ మండలం లక్కారం జిపి పరిధిలోని వేణునగర్‌లో శుభకార్యానికి వెళ్తుండగా పశువుల కాపరి కుమ్ర హనుమంతరావు, రూపాబాయి దంపతుల వెంట ఇద్దరి కుమార్తెలను చూసి దుర్గం శేఖర్ చూశాడు. తల్లిదండ్రులతో మాట్లాడగా వారి దీనస్థితిని తెలియజేశారు. వారికి చదువు ప్రాధాన్యత వివరివంచి బాలికలను చదివించాలని చెప్పాడు. సాయం చేయడానికి ముందుకొచ్చాడు. ఆదిలాబాద్ రావడానికి దారి ఖర్చులకు డబ్బులిచ్చి వచ్చాడు. మంగళవారం బాలికలకు కార్యాలయానికి రావడంతో బాలికలు చదివిన సర్టిఫికెట్లు చూసి సిర్పూర్(యు), లింగాపూర్‌లో గల కేజీబీవీలో అడ్మిషన్ కోసం అధికారులతో మాట్లాడారు. బాలికలను ఆరో తరగతిలో అడ్మిషన్ ఇవ్వడానికి అధికారులు అంగీకరించారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత బాలికలకు సరిపడా బట్టలు, వస్తువులు, స్కూల్ బ్యాగ్స్, దారి ఖర్చులు కూడా ఇస్తానని ఈ సందర్భంగా శేఖర్ తెలిపారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న, జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ బాలికల చదువుపై ప్రత్యేక దృష్టి సారించారని, వారిని ఆదర్శంగా తీసుకొని తాను ఈ బాలికల బాధ్యత తీసుకున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, జంగిలి ప్రశాంత్, బీసీ సంఘం నాయకులు మేకల అశోక్, మదస్తు మహేందర్, కచ్‌కంటి అశోక్, కావేటి మోహన్, సూరజ్ కాంబ్లే, జునుగురు మహేష్, రాజు, షబాజ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ సాధ్యమని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి వారంలో ఒక రోజు డ్రై డే గా పాటించి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత పాటిస్తే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమని పేర్కొన్నారు. దోమ తెరలను వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు శివకృష్ణ, ఏఎన్ఎం, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు: రుయ్యాడి గ్రామ పంచాయతీలో మంగళవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోతారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభయ్‌కుమార్, గ్రామస్తులు గోక సంజీవరెడ్డి, లక్ష్మన్న, సుంకర ప్రసాద్, గోసెల భోజన్న పాల్గొన్నారు.

రోజువారీ ఓబీ లక్ష్యాన్ని సాధించాలి

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గని రోజువారి ఓబి లక్ష్యాన్ని చేరుకోవాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గని రోజువారి ఓబి ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని, అలాగే బొగ్గు ఉత్పత్తి, రవాణా సరైన సమయంలో చేయాలని రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓబి కాంట్రాక్టు కంపెనీ వారితో మాట్లాడి ఓబీ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి తగిన ప్రణాళికలు వేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, ఇందారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపరితల గని ఇంచార్జ్ మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

సబ్‌సెంటర్ల కోసం స్థలాల పరిశీలన



నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని ఊద్సరంగపెల్లి, కుంటలమానెపెల్లి, కుకుడ, బెజ్జూర్ గ్రామాల్లో నూతనంగా మంజూరైన సబ్‌సెంటర్ల పక్కా భవన నిర్మాణాల కోసం మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాం, డాక్టర్ అజీమ్, తహసీల్దార్ శ్రీపాల్ స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలించినట్టు వారు తెలిపారు. కుకుడ గ్రామంలో సబ్‌సెంటర్ నిర్మాణం కోసం ఆ గ్రామానికి చెందిన కొట్రంగి రమేష్ 5 గుంటల భూమిని విరాళంగా ఇచ్చినట్టు వారు తెలిపారు. వీటికి సంబంధించిన స్థలాల అనుమతి పత్రాలను ఉన్నతాధికారులకు అందిస్తామని, త్వరలో వీటిలో పక్కా భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, వీటి ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు వైద్యసేవలు మెరుగుపడుతాయని వారు తెలిపారు. వారి వెంట కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, సర్వేయర్ అంబాజీ, డిప్యూటీ తహసీల్దార్ సుబ్రమణ్యం ఉన్నారు.

విద్యా వాలంటీర్లకు వీడీసీ తరపున వేతనాల అందజేత



నవతెలంగాణ-బాసర

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న విద్యా వాలంటీర్లకు మంగళవారం వీడీసీ తరపున వేతనాలను అందజేశారు. జనవరి నుండి మార్చి నెల వరకు మూడు నెలల వేతనాలను విద్యా వాలంటీర్లు కౌసల్య, దేవన్నలకు వీడీసీ సభ్యుల సమక్షంలో అందించారు. కార్యక్రమంలో వీడీసీ కార్యదర్శి బి.రమేష్, సభ్యులు కృష్ణ రాజేశ్వర్, మహేష్, రాజు పాల్గొన్నారు.

భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరిచేలా కృత్యాలు ఉపయోగించాలి

నవతెలంగాణ - రెబ్బెన

మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వంకులంలో జరుగుతున్న మన ఊరు మన బడి పనులను మండల విద్యాధికారి ఎం వెంకటేశ్వరస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్తికావాల్సిన పనుల వివరాలను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఏవులె ప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న జైఫుల్ లెర్నింగ్ సెంటర్(సమ్మర్ క్యాంపు)కు హాజరైన విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరిచేలా కృత్యాలు ఉపయోగించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో ఆహ్లాదకరమైన అభ్యాసనను ఈ కేంద్రం ద్వారా కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు జాడి ప్రభాకర్, నిర్వాహకుడు ఎం రాజకమలాకర్‌రెడ్డిని ఆయన అభినందించారు.

నేతకాని మహార్ చైతన్య యాత్రను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఈ నెల 25 జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభం కానున్న నేతకాని మహార్ రాజకీయ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని నేతకాని, మహార్ సమన్వయ కమిటీ చైర్మెన్ కొత్తపల్లి గంగేష్, జిల్లా అధ్యక్షులు జాడి కేశవ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దుర్గం ట్రస్ట్ చైర్మెన్, నేతకాని సంఘం సీనియర్ నాయకులు దుర్గం శేఖర్‌తో పాటు జనగం నరేష్, దుర్గం అశోక్‌లు ఈ యాత్రను ప్రారంభిస్తారని అన్నారు. ముఖ్యఅతిధిగా గోపాల్, దుర్గం నగేష్, హాజరవుతుని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేతకాని, మహర్ కులస్తులు 12 లక్షలకు పైగా జనాభా ఉన్నప్పటికి ఎలాంటి గుర్తింపు లేదని అన్నారు. రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని అన్నారు. నేతకాని, మహార్ సంఘాన్ని పటిష్టపరిచి హక్కులను సాధించుకోనేందుకు రాజకీయ చైతన్య యాత్రను చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు దుర్గం మల్లేష్, బక్క రాజన్న, కొత్తపల్లి సురేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు జన్మదిన వేడుకలను మంగళవారం మండలకేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు నరిగెవార్ రాజు మాట్లాడుతూ యాదవులకు రాష్ట్ర గొర్రెల పంపిణీతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అందించి ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మరిన్ని జన్మదిన వేడుకలను జరుపుకొని యాదవ సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జెల్ల అశోక్, యాదవ సంఘం సభ్యులు లస్మయ్య, గుర్రం చిన్నమల్లు, కోత సత్తన్న, నరిగెవార్ ఐలయ్య, రోశన్, అశోక్, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలకేంద్రంలోని రంగనాయక దేవాలయం ప్రాంగణంలో బెజ్జూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు ఎర్రయ్య, పాపన్‌పేట ఎంపీటీసీ శ్రీనివాస్, సభ్యులు సత్యనారాయణ, మల్లేష్, గడ్డం కళ్యాణ్, లక్ష్మి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-బోథ్

ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ప్రతి పాఠశాలలో మొదటి రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను మంగళవారం ఆదర్శ పాఠశాలలో ఎంపీటీసీ షేక్ రజియా బేగం నాజర్ అహ్మద్ దంపతుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో అతి ముఖ్యమైన దశ పదవ తరగతి అని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, నాయకులు సల్ల రవి, ఇర్షాద్, అనిల్ మాసం, షేక్ సాకీర్, మహమ్మద్, రమేష్, సుమెర్ పాషా పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు

నవతెలంగాణ-కడెం

సీఎం కప్ మండల స్థాయి విజేతలకు మంగళవారం ఎంపీపీ అలెగ్జాండర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. వాలీబాల్‌లో మొదటి బహుమతి రానిగూడ, ద్వితీయ బహుమతి కడెం, ఖోఖోలో మొదటి బహుమతి ఉడుంపూర్, ద్వితీయ బహుమతి లింగాపూర్, కబడ్డీ మొదటి బహుమతి అంబారిపేట్, ద్వితీయ బహుమతి లింగాపూర్ గ్రామ పంచాయతీలు సాధించాయి. అథ్లెటిక్ విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో షోయెబ్, ఎండీ ముఖ్తసిర్ ప్రథమ ద్వితీయ స్థానాలు సాదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చిన్నయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ అనూష, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండి రఫీక్, మండల కో ఆప్షన్ సభ్యులు హైమద్, మండల క్రీడల కార్యదర్శి క్రాంతి, పీడీ ప్రభాకర్, అంబారిపేట్ పిఈటి ఇమ్రాన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

మండలంలో పాల్వాయి పాదయాత్ర

నవతెలంగాణ - పెంచికలపేట్

మండలంలోని ఎల్లూరు, ఎలుకపెల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో మంగళవారం బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం అండగా ఉంటానని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి జరుగుతుందని, అర్హులకు పథకాలు చేరడంలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు లహన్‌రాజ్, బీజేపీ మండలాధ్యక్షుడు మధుకర్, బీజేపీ మండల జనరల్ సెక్రటరీ రాజేశ్వర్, నాయకులు సిరిపురం భీమయ్య, డోకె నారాయణ, శోభన్, శ్రీకాంత్, నారాయణ, సుధాకర్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుండి అందుబాటులో హాల్ టికెట్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే 5 నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను బుధవారం నుండి అందుబాటులో ఉంటాయని ఉమ్మడి జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21 తేదిన ఆదివారం ఉదయం 11 గంటల నుండి 1 గంట వరకు పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. హాల్ టికెట్ల డౌన్లోడ్ కోసం టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ ని సందర్శించాలని సూచించారు.